క్లుప్తంగా

సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్‌గా శ్రీనివాసరెడ్డి



కొత్తగూడెంఅర్బన్: సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సికింద్రాబాద్ డివిజన్ కమిటీ మెంబర్‌గా కొత్తగూడెంకు చెందిన కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వై.శ్రీనివాసరెడ్డికి ప్రభుత్వం తరఫున నామినేటెడ్ పదవి దక్కింది. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తనమీద నమ్మకం ఉంచి రైల్వే బోర్డు మెంబర్‌గా నామినేట్ చేసిన ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం కేంద్రంగా కొవ్వూరు రైల్వేలైన్‌తో పాటు రైల్వే జంక్షన్ ఏర్పాటుకు, ప్రముఖ పుణ్యక్షేత్రాలు అయిన దక్షిణయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంకు రైల్వే లైను, అదేవిధంగా తిరుపతికి, కొత్తగూడెం నుంచి ప్రత్యేక రైలు, కరోనా సందర్భంగా నిలిపివేసిన కొత్తగూడెం నుంచి విజయవాడకు వెళ్లే రైలు, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లను పునరుద్ధరణ చేయాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలకు, సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులను త్వరలోనే కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు వెల్లడించారు.

బీసీ కమిషన్ విచారణలో ముస్లింలు పాల్గొనాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనం స్వభావం, ప్రభావాన్ని సమకాలీన, క్షుణ్ణమైన అనుభవ పూర్వక విచారణ నిర్వహించేందుకు 19వ తేదీ మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరగనుంది. బీసీ కమిషన్ విచారణలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల ముస్లిం మేధావులు, విద్యావేత్తలు, సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కమిషన్ ముందు అభిప్రాయాలను 6 సెట్లలో ధృవీకరణ అఫిడవిట్‌తో పాటు రూ.20 నాన్ జ్యుడీషియల్ పేపర్‌లో తెలుగు లేదా ఇంగ్లిష్‌లో అందజేయాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పాపకొల్లు గ్రామస్తులు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను ఆదివారం కొత్తగూడెంలోని ఆయన స్వగృహంలో పాపకొల్లు గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వర ఆలయంలో శ్రీఅభయాంజనేయ స్వామి, శ్రీరాధాకృష్ణుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. రోకటి రంగారావు, గ్రామీణ వైద్యుడు పూసాల శ్రీనివాసాచారి, యాసా వెంకటలాలయ్య, రామిశెట్టి సత్యనారాయణ, ధర్మరాజుల వెంకటనారాయణ ఉన్నారు.

సీతారాములు మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న నాయకులు

జూలూరుపాడు: కాకర్ల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గుండా సత్యనారాయణ తండ్రి సీతారాములు(94) ఆదివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, నర్వనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, వందనపు సత్యనారాయణ, దాసరి నాగయ్య, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, ఎస్కే చాంద్‌పాషా, భిక్షం, లకావత్ గిరిబాబు, చావా వెంకటరామారావు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో?

క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించి సన్నధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అన్నదాతల్లో ఆనందం తాండవించింది. కానీ వరి కోతలు ఊపందుకోగా ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారోనని.. రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో ఆందోళనతో ఉన్న రైతులు మక్క రైతు మాదిరి తమ కష్టాన్ని కూడా దళారుల పరం చేస్తారా.. అని మనోవేదనకు గురవుతున్నారు.



రహదారిపై ధాన్యం ఆరబెట్టిన రైతు

- కేంద్రాల్లో ఫ్లెక్సీలకే పరిమితమైన ప్రక్రియ
- కొనుగోళ్లకు దళారుల దొంగచూపులు
- వర్షభయంతో ఆందోళనలో అన్నదాతలు

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. వాతావరణం కూడా వరికి అనుకూలంగా ఉండటంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చాయి. ప్రస్తుతం మండలంలో యంత్రాల సాయంతో వరి కోతలు ఊపందుకున్నాయి. రైతులు వెంటనే ధాన్యాన్ని రహదారులపై, ఖాళీ ప్రదేశాల్లో ఆరబెడుతున్నారు. మరికొందరు నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబెట్టుకుంటున్నారు.

మూడు చోట్ల ఫ్లెక్సీల ఏర్పాటు..

ఇటీవల ధాన్యం కొనుగోళ్ల కోసం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, తేమశాతం పరిశీలన, బోనస్ చెల్లింపు వంటి అంశాలలో అవగాహన కల్పించారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. కానీ స్థానిక అధికారులు నిర్దేశించిన విధంగా కొమరారం, చల్లసముద్రం కేంద్రంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో, మసివాగు కేంద్రంగా జీసీసీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకొని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కానీ ఎక్కడా కాంటాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

వర్ష భయంతో అన్నదాతలు..

ప్రస్తుతం చాలా మంది రైతులు వడ్లు నూర్పిడి పనులు పూర్తి చేసుకొని తేమశాతం కోసం ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తే సన్నవడ్లకు రూ.2,320, అదనంగా రూ.500 బోనస్ కూడా వస్తుందని విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ అధికారుల ధోరణితో కర్షకులు దిగాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వరికోతలు ఇప్పుడే ప్రారంభమయ్యాయన్న సాకుతో ధాన్యం కొనుగోళ్లకు మరికొంత సమయం తీసుకునే యోచనలో ఉన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం వర్షాలు కురిసే సూచన ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అదునుగా దళారులు రైతుల వద్దకు వెళ్లి తామే కొంటామంటూ రైతులకు మాయ మాటలు చెబుతున్నారు.

మక్క రైతులకు అన్యాయం..

జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగైంది ఇల్లెందు మండలంలోనే. మక్కలు రైతు చేతికందిన సమయంలో ఏకమైన దళారులు ఒకడుగు ముందుకేసి ప్రభుత్వ మద్దతు ధర రూ.2,225కు మించి రూ.2,600 నుంచి రూ.2,800 వరకు చెల్లించి కొనుగోలు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకున్నా ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువగా దళారులు కొనుగోలు చేయడంతో రైతులు దళారుల వైపే మొగ్గు చూపారు. కానీ కాలం గడిచే కొద్దీ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు రావని గుర్తించిన దళారులు ధర తగ్గిస్తూ వచ్చారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో మద్దతు ధర కంటే తక్కువ ధరతో కొనుగోలు చేస్తూ దళారులు రైతులను మోసం చేస్తున్నారు. వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గి దిగాలు పడిన మక్క రైతుకు దళారులు చేసిన మోసం గుర్తించే లోపు మొక్కజొన్నల విక్రయాలు చివరి దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం వర్షం కురిస్తే తడిసిన మక్కలకు ఆమాత్రం ధర కూడా దక్కదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విక్రయానికి సిద్ధంగా ఉన్నాం..



వాతావరణం అనుకూలంగా ఉండటంతో దిగుబడి బాగుంది. వరికోతలు కూడా పూర్తి చేసుకొని తేమ శాతం కోసం ధాన్యం ఆరబెట్టుకున్నాం. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ కేంద్రం ఏర్పాటు చేసిన చోట ఫ్లెక్సీ మినహా కొనుగోలు చేసేవారు లేరు.– మూడు భద్రు, రైతు, కొమరారం

కొనుగోళ్లు ప్రారంభిస్తాం..



మండలంలో కొమరారం, చల్లసముద్రం కేంద్రంగా ధాన్యం కొనుగోళ్లకు అనుమతులు వచ్చాయి. మస్సివాగులో జీసీసీ ద్వారా కొనుగోళ్లు జరుగుతాయి. ఆయా చోట్ల ఇప్పటికే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాం. త్వరితగతిన కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

– హీరాలాల్, సీఈఓ, పీఏసీఎస్, ఇల్లెందు

ఘనంగా కార్తీక వనభోజనాలు



పాల్వంచ: మాట్లాడుతున్న మాజీ మంత్రి వనమా



ఇల్లెందురూరల్: భోజనాలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పాల్వంచ: కాపులు ఐకమత్యంగా ముందుకెళ్లాలని, ఇతర కులాలను గౌరవించాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక అడమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన వనమా మాట్లాడుతూ.. కాపులు సంఘటితంగా ఉండాలన్నారు. వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించిన కమిటీని అభినందించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో యడవల్లి కృష్ణ, వనమా రాఘవేందర్‌రావు, రంగాకిరణ్, కొత్వాల శ్రీనివాసరావు, నూకల రంగారావు, ఎస్పీ నాయుడు, రంగయ్య, నాయుడు, శ్రీను, బోసు బాబు, పుల్లారావు, రాందాస్, అనిల్‌కుమార్, సత్యవతి, పూసల విశ్వనాథం పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో… నవభారత్‌లోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్‌లో ఆర్యవైశ వనసమారాధన ఆదివారం సందడిగా జరిగింది. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ.. ఆర్యవైశులు పలు సంఘాల ద్వారా తోడ్పాటునందిస్తున్నారని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో చలవాది ప్రకాష్, సంకరవి, గూడెపు శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, పెండ్యాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఇల్లెందు పట్టణ, మండల ప్రాంతాల నుంచి ఆర్యవైశ్యులు కార్తీక మాసం సందర్భంగా ఆదివారం వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రొంపేడు గ్రామ సమీపంలోని మామిడితోటకు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వయసు మరిచి పెద్దలు సైతం చిన్నారులతో పోటీపడి స్టెప్పులేశారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. దోసపాటి వెంకటేశ్వర్లు, ధారా రమేష్, ఎనుగూరి నాగేష్‌కుమార్, అర్వపల్లి రాధాకృష్ణ, పొద్దుటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): బూర్గంపాడు మండలంలో డిప్యూటీ తహసీల్దార్ రాంనరేష్, ఆర్‌ఐ ముత్తయ్యలపై శనివారం అర్ధరాత్రి ఇసుక మాఫియా దాడి చేయడాన్ని జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగం వెంకటపుల్లయ్య, వి.మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడి చేసిన వారిపై పీడీ యాక్టు కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ముస్తాబైన కమ్యూనిటీ హాల్



ఏరియా కమ్యూనిటీ హాల్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని 24 ఏరియాకు చెందిన సింగరేణి కమ్యూనిటీ హాల్ రీఓపెనింగ్‌కు ముస్తాబైంది. ఇటీవల ఏరియా జీఎం జాన్ ఆనంద్ కమ్యూనిటీ హాల్, సీఈఆర్ క్లబ్, 24 ఏరియా ఆఫీసర్ క్లబ్‌కు మరమ్మతులు చేయించారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన 24 ఏరియా కమ్యూనిటీ హాల్‌లో శుభకార్యాలు, సభలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఉపయోగంగా ఉంటుంది. అయితే సదుపాయాలు మాత్రం అంతంత మాత్రంగా ఉన్నాయి. అలాంటి కమ్యూటీ హాల్‌ను రెనవేషన్ చేసి తీర్చిదిద్దారు. అన్ని సదుపాయాలు కల్పించారు. లైటింగ్, ఫ్యాన్లు, నీటి సదుపాయం, మరుగు దొడ్లు, మూత్రశాలలు, ఏసీ ఏర్పాటు, ఫ్లోర్‌లో పాలరాతి నిర్మాణం, కలరింగ్ చేశారు. సుందరంగా తీర్చి దిద్దిన కమ్యూనిటీ హాల్‌ను ఒకటి రెండు రోజుల్లో పునఃప్రారంభించనున్నారు.

భారీ వాహనాలు రావద్దంటూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

కొత్తగూడెంఅర్బన్: నివాస ప్రాంతాల నుంచి భారీ వాహనాలు, లారీలు తిప్పవద్దని, దీని వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పాతకొత్తగూడెం, పెనుబల్లి ప్రజలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. లారీలు ప్రవేశించే మార్గంలో బ్యానర్లను ఏర్పాటు చేశారు. బాధితులు మాట్లాడుతూ.. భారీ వాహనాల వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లు కూడా ధ్వంసం అవుతున్నాయని తెలిపారు. లారీలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

ఇల్లెందురూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో వేగవంతంగా కొనసాగుతోంది. ఆదివారం పలు గ్రామాలలో పర్యటించిన ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆదివారం కావడంతో ఎక్కువ మంది ఇంటి వద్దే ఉండటంతో సర్వే వేగవంతంగా సాగింది. పలు గ్రామాలలో రాత్రి వేళ కూడా సర్వే కొనసాగించారు. సర్వే ప్రక్రియను ఆదివారం ఎంపీడీఓ ధన్‌సింగ్, తహసీల్దార్ కోట రవికుమార్ పరిశీలించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు.

చివరి నిమిషంలో ఉరుకులు, పరుగులు

- ప్రశాంతంగా గ్రూప్ – 3 పరీక్ష
- సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్


పాల్వంచ: పాల్వంచలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ – 3 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని మొత్తం 13 సెంటర్లలో ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు పరీక్షలు నిర్వహించారు. అరగంట ముందు వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. చివరి సమయంలో అభ్యర్థులు ఉరుకులు, పరుగులతో పరీక్ష కేంద్రంలోకి అడుగుపెట్టారు. నిముషం ఆలస్యంతో పలువురు అభ్యర్థులు వెనుదిరాగాల్సి వచ్చింది. పరీక్షలకు ఎస్‌ఐలు సుమన్, రాఘవయ్య బందోబస్తు నిర్వహించారు.

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షలకు మొత్తం 936 మంది అభ్యర్థులకుగాను 655 మంది హాజరు కాగా 281మంది గైర్హాజరయ్యారు. నిర్దేశించిన పరీక్ష సమయానికి గంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోని క్యూలైన్‌లో బారులు తీరగా నిర్వాహకులు తనిఖీలు నిర్వహించి లోపలకు అనుమతించారు. పరీక్షలను అబ్జర్వర్ దినేష్ పర్యవేక్షించారు.


సుజాతనగర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల, ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో తొలిరోజు ఆదివారం నిర్వహించిన గ్రూప్–3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అబ్దుల్ కలాం కళాశాలలో పేపర్–1 పరీక్షకు 1,104 మందికి 653 మంది హాజరయ్యారు. పేపర్–2 పరీక్షకు 754 మంది హాజరయ్యారు. ధన్వంతరీ కళాశాలలో పేపర్–1 పరీక్షకు 264 మందికి గాను 185 మంది, పేపర్–2 పరీక్షకు 183 మంది హాజరయ్యారు. అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తనిఖీ చేశారు.



పాల్వంచ: అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద చివరి నిమిషంలో పరుగెడుతున్న అభ్యర్థులు



నిమిషం ఆలస్యం కావడంతో బయటే ఉండిపోయిన అభ్యర్థులు



పాల్వంచరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్ర వద్ద అభ్యర్థులు

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



మట్లాడుతున్న హెచ్‌ఎం మహేష్

కొత్తగూడెంఅర్బన్: పుస్తక పఠనంతో మేధస్సును పెంపొందించుకోవాలని వివేకవర్ధిని పాఠశాల హెచ్‌ఎం అమ్మ మహేష్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహేష్ మాట్లాడుతూ.. పుస్తక ప్రదర్శనలో, దేశ నాయకుల చరిత్రలు, ఆధ్యాత్మిక సాహిత్యం, బాల సాహిత్యం, డిక్షనరీలు, ఎన్‌సైక్లోపీడియా, తెలంగాణ చరిత్ర, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పుస్తకాలు తల్లీవలే లాలిస్తాయి, తండ్రి వాలే ఆదేశిస్తాయన్నారు. పుస్తక పఠన చేసి విజ్ఞానవంతులై సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ఆర్.నాగన్న, మధుబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సుస్థిర పాలన అందిస్తోంది..



మాట్లాడుతున్న నాగా సీతారాములు

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ముందుండి పరిష్కరించి కంటికి రెప్పలా కాపాడుకుంటామని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, తూముచౌదరి అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పెద్దతండాలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో కొనసాగిన నియంతపాలనకు వ్యతిరేకంగా అన్నివర్గాల ప్రజలు ఉద్యమించడం ద్వారా ప్రజలకు సుస్థిర పాలన అందించేందుకు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావడానికి కార్యకర్తలే కీలక పాత్ర పోషించారన్నారు. ఇలాంటి కార్యకర్తలను విస్మరించకుండా నిత్యం అండగా ఉంటామన్నారు. గిరిజనుల సాగు భూములకు హక్కులు కల్పించాలని, ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని ఈ ప్రాంత గిరిజనలు తెలిపిన సమస్యలను సంబంధింత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం జరిగేవిధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దబాబు, పూనెం శ్రీనివాస్, ఏనుగుల అర్జున్‌రావు, ఎండీ.గౌస్, అప్సరఖాన్, మోహన్, సీతారాం రమేష్, లచ్చిరాం రమేష్, బలరాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రి తనిఖీ



సీఎంఓ సుజాతకు సమస్యలను వివరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఆస్పత్రిని సింగరేణి మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) సుజాత ఆదివారం తనిఖీ చేశారు. మందుల స్టోర్‌ను, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులతో అప్యాయంగా మాట్లాడాలన్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నరసింహారావు, క్లర్క్ అరుణ, సిస్టర్ గ్రేస్, సౌభాగ్య వేణి, సలీం తదితరులు ఉన్నారు.

సీఎంఓను కలిసి ఏఐటీయూసీ ప్రతినిధులు..

ఇల్లెందు సింగరేణి ఆస్పత్రి తనిఖీకి వచ్చిన సీఎంఓ సుజాతను ఇల్లెందు ఏరియా ఏఐటీయూసీ ప్రతినిధులు కలిసి ఇక్కడి సమస్యలను వివరించారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య ఆధ్వర్యంలో దాసరి రాజారామ్, సంజీవచారి, బి.శ్రీనివాస్, తురాయి సతీష్‌కుమార్, ఆర్.పైడిరాజు, ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

దుమ్ముతో చస్తున్నా పట్టించుకోరా ?



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టుకి వెళ్లే వాహనాలతో ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళితో అనారోగ్యం పాలై ఆస్పత్రుల పాలవుతున్నామంటూ దాసుతండా గ్రామస్తులు ఆదివారం బొగ్గు లారీలు, టిప్పర్లు నిలిపి రోడ్డుపై ధర్నా చేశారు. టేకులపల్లి సెంటర్ నుంచి దాసుతండా వరకు రహదారి విస్తరించి డివైడర్ నిర్మిస్తూ సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు. కొంత దూరం వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగిలిన రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో ప్రతీరోజూ దుమ్ము, ధూళితో రేగులతండా, దాసుతండా వాసులకు ఇబ్బందులు మొదలయ్యాయి. వాహనాల రాకపోకలతో ఎగిసిపడే దుమ్ముతో నానాయాతన పడుతున్నారు. విసుగు చెందిన స్థానికులు సుమారు నెల రోజుల క్రితం ఆందోళన చేపడితే సింగరేణి అధికారులు రోడ్డుపై నీటిని పిచికారీ చేయిస్తామని హామీ ఇచ్చారు. అయినా సమస్య మళ్లీ మొదటికొచ్చింది. నీళ్లు కాదు రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ మళ్లీ రోడ్డెక్కారు. రెండు వారాల క్రితం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సైతం రోడ్డుని పరిశీలించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కానీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేపట్టిన బాధితులు ఆదివారం కూడా ధర్నా చేయడంతో కేటీసీ నుంచి వచ్చే బొగ్గు లారీలు నిలిచి ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు, సింగరేణి అధికారులు వచ్చి చెప్పినా బాధితులు ఒప్పుకోవడం లేదు. తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

వాగు దాటేందుకు అవస్థలు



వంతెన నిర్మించాల్సిన వాగు ప్రాంతం

సుజాతనగర్: మండలంలోని గొల్లగూడెం గ్రామం అవలి వైపు, ఎగువ ప్రాంతంలో సుమారు 200 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఆ భూములకు ఎదుళ్లవాగు నీరు పారుతుంది. వరి, ఇతర పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఆ పొలాలకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 10 అడుగుల మేర నీటి ప్రవాహంతో పాటు నీటి గుండాలు ఉండడంతో మహిళలు పనులకు వెళ్లడం కష్టంగా ఉంటుంది. వాగు దాటి పొలం పనులకు మహిళలు రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. దీంతో పొలాల సాగు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగుపై చిన్నపాటి వంతెన లేదా కాజ్ వే నిర్మించాలని ఎన్నో ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల తరబడి ఇదే అవస్థ..

చాలామంది రైతులకు చెందిన వ్యవసాయ భూములు ఎదుళ్లవాగుకు అవతల ఉండటంతో వర్షాకాల సమయంలో వాగు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. అవతల ఉన్న పొలాలకు రైతులు వెళ్లాలంటే ప్రాణాలకు తెగించి మరీ వాగు దాటుతున్నారు. మరో మార్గంలో వెళ్లాలంటే చుట్టూ తిరిగి నాలుగైదు కిలోమీటర్ల దూరం ప్రయాణించలేక అతికష్టంతో వాగును దాటుతున్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పంటలకు ఎరువులు, మందులు, ఇతర త్రా సామగ్రిని తీసుకెళ్లేందుకు, పశువులు వచ్చిపోయేందుకు వాగు దాటలేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

అంత్యక్రియలకూ అష్టకష్టాలు..

ఎదుళ్లవాగుపై వంతెన లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో గొల్లగూడెం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం పక్కనే వాగు ఉండటంతో ఎవరైనా మృతి చెందితే వాగు అవతలే అంత్యక్రియలు చేయాల్సిన పరిస్థితి. వాగు ఉధృతి కారణంగా అంత్యక్రియల సమయంలో పక్క గ్రామం మీదుగా శవాన్ని తరలిస్తే చీదరింపులకు గురవుతున్నారు. దీంతో మృతుని కుటుంబీకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగులో శవాన్ని మోసుకెళ్లి ప్రమాదకరంగా అంతిమ యాత్రల చేస్తున్నారు. గతంలో వాగు దాటుతున్న క్రమంలో నలుగురు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిన్నపాటి వంతెన లేదా కాజ్ వే నిర్మించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యవసాయానికి ఇబ్బందిగా ఉంది..



వాగుపై వంతెన లేకపోవడంతో ఎరువులు, ఇతర సామగ్రి తీసుకెళ్లాలంటే చాలా ఇబ్బంది అవుతోంది. చిన్నపాటి వంతెన ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుంది. ఎంతో మంది నాయకులు, అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– వీర్ల వెంకటేశ్వర్లు, గొల్లగూడెం

చుట్టూ తిరిగి రావాలి..



గ్రామంలో ఎవరైనా చనిపోతే శవాన్ని మోసుకుంటూ చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే వాగు పక్క నుంచి బురదలో శవాన్ని మోసుకుంటూ ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మామిడాల సాంబశివరావు